ఉల్లిసాగుపై రైతుల ఆసక్తి

- నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల ఎకరాల్లో సాగు
- సాగులో పెరిగిపోతున్న పెట్టుబడులు
- తెగుళ్ల నివారణకు విరివిగా మందుల పిచికారీ
- ధరలు పడిపోతే నష్టమే అంటున్న రైతులు


సాగులో ఉన్న ఉల్లి పంట

వేముల : ఉద్యానవన పంటల్లో అరటి తర్వాత పెట్టుబడులతో కూడుకున్నది ఉల్లి పంట. ఈ ఏడు ఉల్లిసాగుపై రైతులు దృష్టి సారించారు. పంట కాలం తక్కు అయినప్పటికీ పెట్టుబడులు మాత్రం పెరిగిపోతున్నాయి. ఒక్కోసారి సాగులో పెట్టుబడులు పెట్టినా తెగుళ్లతో పంట దెబ్బతింటే దిగుబడులు లేకపోవడం, ధరలు పడిపోవడం, తదితర కారణాలతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఉల్లిసాగు చేసే రైతులకు అన్ని అనుకూలిస్తేనే ఆదాయం ఉంటుంది. సాగు అనంతరం తెగుళ్లు, ధరలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోతే ఉల్లిసాగు రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. అయినప్పటికీ రైతులు ఉల్లిసాగునే ఎంచుకుంటున్నారు. ఇతర వ్యవసాయ పంటలకంటే ఉల్లిసాగులో ఆదాయం ఉంటుందనే ఉద్దేశంతో రైతులు ఆ దిశగా సాగుకు సిద్ధమవుతున్నారు.

నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో సాగు

ఈ ఏడు ఉల్లిసాగు విస్తీర్ణం కొంతమేర పెరిగిందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. పులివెందుల నియోజకవర్గంలో 3వేల ఎకరాల్లో ఉల్లి సాగైంది. ఉల్లి పంటను మే, జూన్ మాసాల్లో సాగుచేస్తారు. నియోజకవర్గంలోనే వేముల మండలంలో అత్యధికంగా 1000 ఎకరాలకు పైనే ఉల్లి సాగైంది. మిగిలిన మండలాల్లో అక్కడక్కడ రైతులు ఉల్లిని సాగుచేశారు. భూమి విస్తీర్ణం ఉన్న రైతులు ప్రతీ ఏడు ఉల్లిపై ఆసక్తి చూపుతున్నారు. ఒక ఏడాది నష్టపోయినా మరో ఏడాది ఆదాయం రాకపోదా అన్న ఆశ రైతుల్లో ఉంటోంది. దీంతోనే రైతులు ఉల్లికి మొగ్గు చూపుతూ కొంత మంది రైతులు ముందు అదునుగా సాగు చేస్తే మరికొంత మంది వెనుక అదునులో సాగు చేస్తూ దిగుబడులు వచ్చే సరికి ధరలు ఉండేలా రైతులు దృష్టిపెట్టారు.

సాగులో పెరిగిపోతున్న పెట్టుబడులు

ఎకరా ఉల్లి సాగు చేయాలంటే రూ.40 వేలు పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. సాగు మొదలుకుని దిగుబడులు వచ్చే వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. సాగు చేసిన 20 రోజుల నుంచే తెగుళ్లు సోకకుండా మందులను పిచికారీ చేస్తున్నారు. పంటలో ఎప్పటికప్పుడు కలుపు లేకుండా తీసివేస్తూ దిగుబడులు వచ్చే వరకు పంటను కాపాడుకొంటూ తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్తగా మందులను పిచికారీ చేస్తూ నివారణ చర్యలు తీసుకుంటున్నారు.

ఎకరాకు 80 క్వింటాళ్ల మేర దిగుబడులు

ఉల్లి సాగులో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయి. ఎకరాకు 80 క్వింటాళ్లపైనే దిగుబడులు ఉంటాయి. తెగుళ్లు సోకకుండా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఎకరాకు 120 క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఉల్లి పంట కాలం నాలుగు నెలలు. 120 రోజులకే పంట దిగుబడులు చేతికి అందుతాయి. సాగులో జాగ్రత్తలు తీసుకుంటేనే దిగుబడులు వస్తాయని లేదంటే దిగుబడులు ఏ మాత్రం అందవని రైతులు అంటున్నారు.

ధరలు ఉంటే సాగులో ఆదాయమే

సాగులో పెట్టుబడులు అయినప్పటికీ దిగుబడులు బాగా ఉండి ధరలు ఉంటేనే ఆదాయం ఉంటుంది. గ్రామాల్లో నెలరోజుల పాటు ఉల్లి దిగుబడులు వస్తుంటాయి. రైతులు పంటకాలం పూర్తి అవగానే ఉల్లిపంటను పెరికివేసి గడ్డలను వేరుచేస్తారు. ఆ సమయానికి మార్కెట్‌లో ధరలు ఉంటే వెంటనే రైతులు వ్యాపారులకు విక్రయిస్తారు. ధరలు లేకపోతే ఉల్లి దిగుబడులను నిల్వ ఉంచుకునే పరిస్థితి లేనందున మార్కెట్ ధరలను బట్టి తోటలలో ఉల్లి గడ్డను పీకివేస్తారు. ధరలు అప్పటికీ లేకపోతే ఉల్లి గడ్డలను వేరుచేయకుండా పీకివేసి అలాగే ఉంచుతారు. అప్పటికీ మార్కెట్‌లో ధరలు పెరగకపోతే ఉల్లిగడ్డలను ఉన్నధరలకే అమ్మివేస్తారు. ఇలాంటి పరిస్థితులు ఉంటే మార్కెట్ ధరలు ఉంటే ఆదాయం , లేదంటే నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

5 ఎకరాల్లో ఉల్లి సాగు చేశా



నాకున్న 5 ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశాను. సాగు చేసి నెల రోజులు కావస్తోంది. ఇప్పటికే మందులను రెండు సార్లు పిచికారీ చేశా. సాగులో లక్ష రూపాయలు పైనే పెట్టుబడులు పెట్టా. దిగుబడులు వచ్చే సరికి మరో లక్ష రూపాయలు పెట్టుబడి అవుతుంది. మార్కెట్ ధరలు ఉంటేనే ఆదాయం ఉంటుంది. లేకుంటే సాగులో తీవ్రంగా నష్టపోతా.

చంద్రఓబులరెడ్డి, ఉల్లిరైతు, గొందిపల్లి

ధరలతోనే ఆదాయం



ఉల్లి సాగులో ఆదాయం ధరలను బట్టి ఉంటుంది. సాగులో దిగుబడులు వచ్చిన సమయానికి మార్కెట్‌లో ధరలు ఉంటే వ్యాపారులు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపుతారు. ధరలు లేకపోతే కొనుగోళ్లకు వ్యాపారులు తొంగిచూడరు. ఒక్కోసారి ముందు అదునులో దిగుబడులు వస్తే ధరలు లేకపోయినా వెనుక అదునులో సాగైన తోటలలో వచ్చే దిగుబడులకు ధరలు ఉండే అవకాశం ఉంటుంది. ధరలు పడిపోతే ఉల్లిసాగులో నష్టాలను చవిచూస్తాం.

శ్రీనివాసులరెడ్డి, ఉల్లిరైతు, నల్లచెరువుపల్లె

సాగులో దిగుబడులు తగ్గితే ధరలు పెరుగుతాయి



సాగులో దిగుబడులు ఉన్నప్పటికీ ధరలు ఉంటేనే రైతులకు ఆదాయం ఉంటుంది. ధరలు పడిపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం కూడా ఉంది. మార్కెట్‌ధరలు డిమాండ్, సప్లై పై ఆధారపడి ఉంటాయి. మార్కెట్‌లో దిగుబడులు తగ్గితే ధరలు పెరగడం, దిగుబడులు పెరిగితే ధరలు తగ్గడం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొంత మంది రైతులకు మాత్రమే ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ, పులివెందుల

మట్కా స్థావరాలపై దాడి

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో శనివారం మట్కా నిర్వహిస్తున్న వారిపై దాడిచేసి వారి వద్దనుంచి రూ.1500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిలు తెలిపారు. మండలం, మున్సిపాలిటీలో ఎవరైనా మట్కా, పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లోని ప్రజలు కూడా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు

ముద్దనూరు : కౌలుకు భూమి సాగు చేస్తున్న ప్రతి రైతుకు పంట సాగు హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కౌలుకు భూమిని సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులను సంప్రదించి సాగు ధృవీకరణ పత్రాలు పొందాలని, ఈ కార్డు పొందిన రైతుకు 11 నెలల కాల వ్యవధి మాత్రమే భూమిని సాగు చేసే హక్కు వుటుందన్నారు. మిగతా వివరాల కోసం అధికారులను సంప్రదించాలని ఏవో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిపోయిన పౌష్టికాహారం

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం నిలిచిపోయింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారంతోపాటు పాలు కూడా అందిస్తారు. అయితే జూలై నెలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన 3 కేజీల బియ్యం, పోషక విలువలతో కూడిన పదార్థాలు అందలేదని గర్భిణులు, బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీలకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సరైన సమయంలో అందించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కొలువుతీరిన పీర్లు


మొహరం వేడుకలకు ముస్తాబైన పీర్లు

సింహాద్రిపురం : మండలంలో పీర్లు ప్రతిష్టించడానికి చివరి రోజు కావడంతో శనివారం సింహాద్రిపురం, గురిజాల, తదితర గ్రామాల్లో పీర్ల చావిడిలను విద్యుత్ దీపాలతో అలంకరించి పీర్లను ముస్తాబు చేసి ప్రతిష్టించారు. ఆదివారం చిన్నసరిగెత్తు, మంగళవారం పెద్దసరిగెత్తు, రాత్రికి అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తారు. బుధవారం జలసమాధి కార్యక్రమం నిర్వహించడంతో మొహరం వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న అంజన్‌కుమార్

జమ్మలమడుగు : రక్తదానం చేయడంతో ఒక నిండు ప్రాణంతోపాటు ఒక కుటుంబాన్ని ఆదుకున్నట్లే అని మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ అధ్యక్షుడు లక్ష్మన్ మోరె తెలిపారు. శనివారం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ గురుదేవికి రక్తం తక్కువగా ఉందని వెంటనే రక్తం ఎక్కించాలంటూ వైద్యులు సూచించారు. ఓ పాజిటివ్ రక్తం కావాలంటూ బాధిత కుటుంబం మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించడంతో అంజన్‌కుమార్ రక్తదానం చేశారు.

నేడు గురుపూజోత్సవం

చెన్నూరు : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో చెన్నూరు ప్రధాన రామాలయంలో ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడికి గౌరవ డాక్టరేట్


సత్తెనపల్లి బాబు

జమ్మలమడుగు రూరల్ : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ సత్తెనపల్లి బాబుకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. శనివారం హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగిన ఓ కార్యక్రమంలో డాక్టర్ బాబుకు ఈ అవార్డు అందుకున్నారు. తెలుగు సాహిత్యంపై ఈయన చేసిన కృషికి ఫలితంగా గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు భారతీయ స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. కాగా డాక్టర్ సత్తెనపల్లి బాబు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తెలుగు సాహిత్యంలో అనేక రచనలు చేశారు. స్థానికులు, ఉపాధ్యాయ వర్గం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాంగ హత్యాదినంగా ప్రకటించడం హాస్యాస్పదం

వేంపల్లె : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ జూన్ 25ను రాజ్యాంగ హత్యాదినంగా మోదీ ప్రభుత్వం గెజెట్‌లో ప్రకటించడం హాస్యాస్పదమని ఏపీసీసీ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ వైఖరి చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. 1962లో చైనా దురాక్రమణ, 1975లో పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆర్టికల్ 352 ప్రకారం ఎమర్జెన్సీ విధించి, పరిస్థితులు చక్కబడ్డాక ఎత్తివేయడం జరిగిందన్నారు. జూన్ 25ను రాజకీయ హత్యా దినంగా ప్రకటించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం సెల్ఫ్ గోల్ కొట్టుకున్నదని ఆయన ఎద్దేవా చేశారు.

విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) జాతీయ కార్యదర్శి షాకీర్ హుస్సేన్, జిల్లా అధ్యక్షులు నజీర్‌బాషలు కోరారు. ఈ విషయమై శనివారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కడపలోని కార్యాలయంలో కలిసి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటా ఉపాధ్యక్షుడు అబ్దుల్‌కలాం, ట్రెజరర్ ఫయాజుర్ రెహమాన్, అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికడదాం

ఖాజీపేట : ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రొద్దుటూరు రేంజ్ ఎఫ్ఆర్ఓ హేమాంజలి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు ఎవ్వరు పాల్పడినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఖాజీపేట మండల పరిధిలోని ఖాజీపేట సెక్షార్, జాండ్లవరం బీట్, నాగసానిపల్లె, పత్తూరు బీట్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు కూంబింగ్ నిర్వహించారు.

తన భూమిని పాసు పుస్తకంలో ఎక్కించండి సారూ..


ఆందోళన వ్యక్తం చేస్తున్న సుబ్బారెడ్డి

కమలాపురం : తన 70 సెంట్ల భూమిని పాసు పుస్తకంలో ఎక్కించాలని పలు మార్లు విన్నవించినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తన భూమిని పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాలని జీవంపేటకు చెందిన రైతు పుత్తా సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. శనివారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబర్ 153లో తనకు 70 సెంట్ల భూమి ఉందన్నారు. అయితే ఆ భూమిని పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాలని పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగానని, అయినప్పటికి వారు స్పందించడం లేదని వాపోయాడు. ఎందుకు ఆన్‌లైన్‌లో ఎక్కించడం లేదని ప్రశ్నించడంతో రీ సర్వే పెట్టుకోవాలని అధికారులు ఉచిత సలహా ఇచ్చారన్నారు. రీ సర్వే కొరకు సంబంధిత అధికారులను సంప్రదించగా రీ సర్వే ఆన్‌లైన్ పని చేయడంలేదని వారు చెబుతున్నారన్నారు. తన భూ మిని ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి ఎవరిని అడగాలో, ఏమో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తన 70 సెంట్ల భూమిని పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాలని ఆయన కోరుతున్నాడు.

రెడ్డి కమ్యూనిటీకి చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న వెన్నపూస అరవిందనాథ్‌రెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురం స్మార్ట్ రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్)కు రూ.56,116లు ఆర్థిక సాయం చెక్కును వెన్నపూస అరవిందనాథ్‌రెడ్డి శనివారం అందజేశారు. ఆర్సీడీఎస్ ఆధ్వర్యంలో రెడ్ల యొక్క ఘన చరిత్రను పుస్తకం రూపంలో అందించాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అరవింద్‌నాథ్‌రెడ్డి అందించినట్లు రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. అరవింద్‌నాథ్‌రెడ్డికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆర్సీడీఎస్‌లో రెడ్డి కుటుంబం సభ్యులుగా చేరుటకు, రెడ్ల ఘన చరిత్ర పుస్తకంలో మీ వ్యాపార ప్రకటనలు ఇచ్చుటకు 9704093708 నెంబరును సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాయలసీమ కన్వీనర్ చప్పిడి జగదీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కార్యదర్శి ఒంటెద్దు నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవి ఆవుల మందతో రైతుల బెంబేలు


పొలాల్లో సంచరిస్తున్న అడవి ఆవులు

కొండాపురం : మండలలో 15 వేల హెక్టార్లలో సాగు భూమి విస్తీర్ణం ఉంది. వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పొలాల్లో అడవి ఆవులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. బొమ్మేపల్లె, దొంతికోన కొండ ప్రాంతాల్లో గతంలో అడవి ఆవులు నివాసం ఉంటున్నాయి. గతంలో గండికోట జలాశయంలో పూర్తి నీటి సామర్థ్యం పెట్టడంతో ప్రాజెక్టు సమీపంలో ఉండే అడవి ఆవులు పంట పొలాల్లోకి వచ్చి చేరాయి. రాత్రివేళ సాగు చేసిన పొలాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనవారిపల్లె, ఉప్పికాయలపల్లె, కొట్టాలపల్లె, బురుజుపల్లె, కె.సుగుమంచిపల్లె, వెంకటాపురం, బ్రాహ్మణపల్లె, గ్రామాల్లో అడవి ఆవులతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఫారెస్ట్ అధికారులు స్పందించి అడవి ఆవుల బెడద లేకుండా చూడాలన్నారు.

పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

రాజుపాళెం : పశువులకు పచ్చి గడ్డి వేయడం వల్ల అధికంగా పాలు ఇవ్వడమేగాకుండా ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని గాదెగూడూరు పశు వైద్య అధికారి డాక్టర్ కె.ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం వల్ల పాలల్లో వెన్నశాతం పెరిగి పాడి రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, పిల్లి పెసర, బహువార్షికాలైన సూపర్ నేపియర్, పారాగ్రాస్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ ఆఫీసులో అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికుల వద్ద నుంచి పీఎఫ్‌లో తప్పులను సవరిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇటీవల డ్రైవర్లకు రూ.24వేలు వేతనం పెరిగితే వేతనం చేసేందుకు రూ.2వేలు వసూలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. కింది స్థాయి ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, కమిషనర్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ సెక్షన్‌లో ఉన్న వారిని ఆ సెక్షన్‌లోనే విధులకు పంపకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ చుట్టు తిప్పుకుంటున్నారన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం భక్తులు సామూహికంగా భజనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

మొహరం భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

పోరుమామిళ్ల(అట్లూరు) : మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకోవాలని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ తిమోతిలు తెలిపారు. పోరుమామిళ్ల సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మొహరం పండుగ జరుపుకునే కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తినా అందుకు బాధ్యులుగా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. అందరూ ఐకమత్యంగా పండుగను జరుపుకోవాలన్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం

చాపాడు : మండలంలో కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుంచి ఆగష్టు 2 వరకూ నిర్వహించనున్న జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై నాగులపల్లెలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన మచ్చలు, దురద లేని మచ్చలు, మొద్దుబారిన మచ్చలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వ్యాధి గ్రహస్తులను సకాలంలో గుర్తించి వైద్య సిబ్బంది సేవలు అందించాలన్నారు. రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబురెడ్డి, ఏఎన్ఎం మేరి, ఆశా వర్కర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అధికార భాషా సంఘాన్ని పునరుద్ధరించండి

బద్వేలు అర్బన్ : అధికార భాషా సంఘాన్ని సమర్థులతో పునరుద్ధరించాలని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. శనివారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాతృభాషాభివృద్ధికి స్పష్టమైన విధివిధానాలను ఏర్పాటు చేసి తగినంత నిధులను సమకూర్చి అధికారాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుభాష కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గిడుగురామ్మూర్తి పంతులను ఆదర్శంగా తీసుకుని మాతృభాషను అభివృద్ధి చేసి అచ్చమైన తెలుగువారిగా జీవించాలని ప్రజలను కోరారు.

రాజపత్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి


రాజపత్రాలను దహనం చేస్తున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు


జమ్మలమడుగులో గెజిట్ పత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వేంపల్లె : ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు జీపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు పరుస్తూ ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం బాలుర ఉన్నత పాఠశాల ఎంట్రెన్స్ గేటు ఎదుట జీపీఎస్ అమలు పరుస్తూ ఇచ్చిన రాజపత్రాలను వారు దహనం చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు జీపీఎస్ అనే విధానాన్ని చట్టం చేసి గెజిట్లో ఉంచిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయులకు తీరని నష్టాన్ని కలిగించే జీపీఎస్ లాంటి నిర్ణయాలు తీసుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీపీఎస్, సీపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని లేకపోతే పోరాట కార్యక్రమాలకు సిద్ధమవుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్, సీపీఎస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్‌ను అమలు చేయడం దుర్మార్గం

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ విధానం అమలు చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణలు తెలిపారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద జీపీఎస్ పత్రాలను వారు దహనం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జీపీఎస్‌ను రద్దుచేసి దాని స్థానంలో మెరుగైన విధానం తీసుకువస్తామన్న వారు ఇలా చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నాబార్డు కృషి


మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి

కడప కల్చరల్ : వ్యవసాయంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నాబార్డు సంస్థ ఎంతో కృషి చేస్తోందని సంస్థ జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి అన్నారు. సంస్థ 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ విహారి తొలుత తానే రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులు తమ కార్యాలయానికి విచ్చేసి రక్తదానం చేయడంతో సంస్థకు గౌరవం చేకూరినట్లయిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత ఎక్కువగా రక్తదాతలు ముందుకు రావాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గ్రామీణ వర్గాల పరిస్థితిని మెరుగు పరచడం, దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో విశేషమైన సహకారాన్ని గుర్తించేందుకు ఈ రోజును అంకితం చేశారన్నారు. స్థిరమైన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించేందుకు నాబార్డు బ్యాంకును స్థాపించారన్నారు. గ్రామీణులకు ప్రయోజనం చేకూర్చే విధానాలు, కార్యక్రమాల అమలులో సంస్థ ముందంజలో ఉందన్నారు. 43 సంవత్సరాలుగా సంస్థ ఎన్నో విజయాల మైలురాళ్లను సాధించిందని వివరించారు. నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ విజయ విహారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలను అభినందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదాన ఆవశ్యకత గురించి మరింత విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 25 మందికి పైగా రైతులు రక్తదానం చేశారు. పులివెందుల, ప్రొద్దుటూరు, ఒంటిమిట్ట, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్, సుస్థిర వ్యవసాయ కేంద్రం తదితర ప్రాంతాల నుంచి ఆయా సంస్థల ఉన్నతాధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో శారీరక, మానసిక ఉల్లాసం

ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసికంగా ఉల్లాసవంతంగా ఉండడమే కాకుండా విధి నిర్వహణలో చురుగ్గా ఉండగలరని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం కడప నగర పరిధిలోని స్పోర్ట్స్ స్కూలులో ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ స్పోర్ట్స్ మీట్-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈడీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగిలో ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయన్నారు. ఉద్యోగులు క్రమం తప్పకుండా క్రీడా సాధన చేస్తూ ఆయా క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా తమ సత్తా చాటగలరన్నారు. అంతేకాకుండా క్రీడల్లో రాణించే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే పదోన్నతుల్లో కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు. అనంతరం ఈడీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డితోపాటు పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.